నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 128 | గురువారం, 15 అక్టోబర్ 2026 | పేజీలు -4 | వెల : 3/-




## గజ్వేల్‌కు మళ్లీ వస్తా.. ఒక రోజంతా మీతోనే ఉంటా..!



గజ్వేల్, **వాస్తవ తెలంగాణ** గజ్వేల్‌కు మళ్లీ వస్తానని, ఒకరోజంతా పార్టీ శ్రేణులతోనే గడుపుతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు వెళ్తున్న కేటీఆర్ బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని రిమ్మనగూడ ఎస్-4 వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. కేటీఆర్‌కు అభివాదం చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన నాయకులు, కార్యకర్తలతో కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడారు. ఈ క్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. "మళ్లీ ఒకసారి గజ్వేల్‌కు వస్తా.. ఒకరోజంతా మీతోనే ఉంటా" అని పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలతో గజ్వేల్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. అనంతరం కేటీఆర్ భారీ కాన్వాయ్‌తో గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు బయలుదేరారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

## వచ్చే బతుకమ్మ నాటికి ఇందిరమ్మ ఇళ్ల అప్పగింత: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, **వాస్తవ తెలంగాణ** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ వివక్షకు తావులేదని, అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందిరమ్మ టవర్స్ పనులకు 23 నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఫ్లాట్లు కేటాయిస్తామని, లబ్ధిదారులకు ఫ్లాట్‌తో పాటు భూమిలో వాటాకు సంబంధించిన హక్కులు కూడా కల్పిస్తామని చెప్పారు. అంతేకాకుండా, ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడమే లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.440 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.



# ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ

## 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం
- యువత, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- బిజినెస్ సమ్మిట్–2026లో సీఎం రేవంత్‌రెడ్డి

**వాస్తవ తెలంగాణ** తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన బిజినెస్ సమ్మిట్-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యాపారాభివృద్ధిలో సమాఖ్యల పాత్ర ఎంతో కీలకమని సీఎం పేర్కొన్నారు. ప్రాచీన కాలంలో వస్తు మార్పిడి విధానంతో ప్రారంభమైన వాణిజ్యం, నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా మారిందన్నారు. ఆధునిక సాంకేతికత, ప్రపంచ మార్కెట్‌లో వస్తున్న మార్పులను అర్థం చేసుకుని కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇలాంటి వ్యాపార సమ్మేళనాలు దోహదపడతాయని చెప్పారు. కొత్త తరానికి మార్గనిర్దేశం చేసే వేదికగా ఈ కార్యక్రమం నిలవడం అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్టస్థానాలు సంపాదించారని కొనియాడారు. వారి విజయగాథలను సమాఖ్య నమోదు చేసి భావితరాలకు ఆదర్శంగా నిలిపేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

### మూడు ఆర్థిక మండలాలుగా అభివృద్ధి

2047 నాటికి స్వతంత్ర భారతదేశం వందేళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో దేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని సీఎం అన్నారు. ఆ లక్ష్య సాధనలో రాష్ట్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, అభివృద్ధి విషయంలో అన్ని వర్గాలు రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్-2047 విజన్' పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని మూడు ప్రధాన ఆర్థిక మండలాల ఆధారంగా ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తూ ఐటీ, సేవారంగం, అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేసి తయారీపరిశ్రమలు,పారిశ్రామికపార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లను ప్రోత్సహిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలను రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా తీర్చిదిద్ది వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధి అవకాశాలను విస్తరించనున్నట్లు వెల్లడించారు.

### జీడీపీలో తెలంగాణ వాటా రెట్టింపు లక్ష్యం

ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా సుమారు ఐదు శాతంగా ఉందని, దానిని 10 శాతానికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. నాలుగు వందల ఏళ్ల క్రితమే చార్మినార్ దేశ, విదేశాల వ్యాపారులకు గుర్తింపు చిహ్నంగా నిలిచిందని, ప్రస్తుతం హైటెక్ సిటీ ప్రపంచ ఐటీ, సేవారంగానికి కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానంలో ప్రతి పారిశ్రామికవేత్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్న దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. తెలంగాణలో మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల నిర్వహణ, సోలార్ విద్యుత్ ప్లాంట్ల యాజమాన్యంలో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.



## జంతర్ మంతర్ నిరసన కేసు.. సీజేపీ నేతలకు ఐదు రోజుల కస్టడీ

### అరెస్టులను ఖండించిన రాహుల్ గాంధీ

**వాస్తవ తెలంగాణ** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలకు న్యాయస్థానం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నిరసనలకు అనుమతి లేదని ప్రకటించిన ప్రాంతంలోకి ప్రవేశించారనే ఆరోపణలపై పోలీసులు వారిని అరెస్టు చేశారు. మరో నేత అజింక్యా షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. ఈ అరెస్టులను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని, ఇందుకు యువతను జైలుకు



పంపడం పిరికిపంద చర్య అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. పౌరుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణే లక్ష్యమని తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్, ఎంకే స్టాలిన్, అభిషేక్ బెనర్జీ, ఆదిత్య ఠాకరే తదితర విపక్ష నేతలు కూడా అరెస్టులను ఖండించారు.

# దేవి నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన పులిమామిడి మమత రాజు దంపతులు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాసదాశివపేట దేవి నవరాత్రుల సందర్భంగా సదాశివపేట పట్టణంలోని చాపలకేరి శ్రీ మహంకాళి మందిరంలో 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ మహంకాళి మాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమివ్వగా మమత రాజు దంపతులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు రాకేష్ పంతులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఇట్టి సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ దేశంలో ఏలినో ప్రభావం వలన వర్షాలు పడడం లేదని, నీళ్లులేక పాడి పంటలు ఎండిపోతున్నాయని, తాగునీరు రోజు రోజుకు తగ్గిపోతుందని, అమ్మ మా దేశ ప్రజలను సుబిక్షంగా ఉంచమ్మ, వర్షాలు కురిపించమ్మా, ప్రజలను చల్లగా చూడమ్మా, కరువునుండి కాపాడమ్మా అని పులిమామిడి రాజు అమ్మవారిని వేడుకున్నారు. ఇంత భక్తితో కొలిచే నిన్ను నిమజ్జనం చేయాలంటే చెరువుల్లో నీళ్ల లేవమ్మా, కరుణించమ్మ కాపాడమ్మా, నీ యొక్క నిమజ్జనంలోపు వర్షాన్ని కురిపించి నువ్వు ఉన్నావని నిరూపించుకొమ్మని ఆ మహంకాళి మాతను, అన్న పూర్ణమాతను సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు వేడుకున్నారు సదాశివపేట అంటేనే ఎల్లప్పుడు ఆ సదాశివుడు నివసించే ప్రాంతం అని పులిమామిడి రాజు అన్నారు. ఇక్కడ ఉన్నన్ని దేవాలయాలు ఏ గ్రామంలో లేవని అన్నారు. అనంతరం పులిమామిడి మమత రాజు దంపతుల ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి నిర్వహించిన భజన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగింది ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ వైద్యం గోపి ప్రియాంక పవన్ మరియు శ్రీ మహంకాళి దేవాలయ అధ్యక్షులు నల్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి నల్ల శంకర్, కార్యవర్గ సభ్యులు చాపల హన్మంతు, జనార్ధన్ బంటు రవి, సాతాని నరేందర్, మహేష్, అఖిల్, నాగరాజు, రాగం అనిల్, తాలెల్మ రాము, సోమ శంకర్ తదితరులతో పాటు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో మతపరమైన వివక్షకు తావులేదు..

**హిందూ ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు-ఏనుగు సుదర్శన్ రెడ్డి**

**భవాని మాత దీక్షలో ఉన్న విద్యార్థుల పట్ల అనుచిత వ్యాఖ్యలు**

**అనురాగ్ యూనివర్సిటీ వైద్య కళాశాల యాజమాన్యంతో చర్చలు.. విద్యార్థులకు క్షమాపణలు**




**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ ఘట్కేసర్ సర్కిల్ ఏదులాబాద్ డివిజన్ ఔషపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ నీలిమ వైద్య కళాశాలలో భవాని మాత మాలధారణ మరియు దీక్ష తీసుకున్న విద్యార్థుల పట్ల కొంతమంది లెక్చరర్లు,డీన్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణలను మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. దీక్ష తీసుకుంటే ఎలా చదువుకుంటారని ప్రశ్నిస్తూ విద్యార్థుల మత విశ్వాసాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఆయన కళాశాలకు వెళ్లి దీక్షలో ఉన్న విద్యార్థులను పరామర్శించారు. అనంతరం కళాశాల యాజమాన్యంతో చర్చించి, విద్యార్థుల మనోభావాలను గౌరవించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఇతర మతాల ఆచారాలు, సంప్రదాయాలను ఎలాగైతే గౌరవిస్తామో, హిందూ ధర్మాన్ని, హిందువుల విశ్వాసాలను కూడా అదే విధంగా గౌరవించాల్సిందేనని డిమాండ్ చేశారు.ఏ మతానికి చెందిన వారైనా ఇతరుల విశ్వాసాలను కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని అన్నారు. భవాని మాత దీక్ష తీసుకోవడం విద్యార్థుల వ్యక్తిగత విశ్వాసమని, దానిని ప్రశ్నిస్తూ అవమానించడం తగదని పేర్కొన్నారు.హిందువులే హిందువులకు శత్రువులనే పరిస్థితి రావొద్దు:హిందూ ధర్మాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ఏనుగు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.ఇతర మతాలను గౌరవించాలని కోరుకునే వారు హిందూ ధర్మాన్ని కూడా గౌరవించాల్సిన బాధ్యతను గుర్తించాలని అన్నారు. విద్యాసంస్థల్లో మతపరమైన వివక్షకు తావులేకుండా అన్ని మతాల విద్యార్థుల విశ్వాసాలకు సమాన గౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు.కళాశాల యాజమాన్యంతో చర్చల అనంతరం క్షమాపణలు తెలిపినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏనుగు సుదర్శన్ రెడ్డి సూచించారు. విద్యాసంస్థలు విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో పరస్పర గౌరవం, మత సామరస్యం, సహనాన్ని పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ అధ్యక్షులు నాగరాజు ఘట్కేసర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు అనిల్ గౌడ్, కాసుల వెంకటేష్ గౌడ్, భరత్ యాదవ్ ,సాయి గౌడ్, భవాని మాత భక్తులు, హిందూ బంధువులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

**షాద్‌నగర్ ఆర్డీవోకు వినతిపత్రం.. రాజ్యాధికార పార్టీ నాయకుల నిరాహార దీక్ష**




**మియాపూర్, అక్టోబర్ 14 (వాస్తవ తెలంగాణ):** షాద్‌నగర్ నియోజకవర్గంలోని చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పర మోని రాములు, ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో ఈ దీక్ష నిర్వహించారు. అనంతరం షాద్‌నగర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో కొనసాగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపడతామని కాంగ్రెస్ నాయకులు గత రెండేళ్లుగా చెబుతున్నప్పటికీ, పనులు నిలిచిపోయిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఈ బ్రిడ్జిపై ఆధారపడే సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల భద్రత దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించకపోతే నిరవధిక నిరాహార దీక్షకు సైతం వెనుకాడబోమని రాజ్యాధికార పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ దీక్షలో కొందుర్గు మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు జగన్ ఫారూక్, చౌదరిగూడ మండల అధ్యక్షుడు దొర్తల రాములు, జిలేళ్ల జోసెఫ్, ప్రధాన కార్యదర్శి, పార్వతాపూర్ గ్రామ అధ్యక్షుడు యాదయ్య, కొందుర్గు మండల ఉపాధ్యక్షుడు మిద్దె ఎల్లారాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పటిష్టత కృషి నాగారం, ఎదులాబాద్ కాంగ్రెస్ నూతన కమిటీలు..

**పార్టీ బలోపేతమే లక్ష్యం.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే ధ్యేయం: వజ్రేష్ యాదవ్**

**ప్రభుత్వ పథకాలు చిట్టచివరి వ్యక్తి చేర్చాలి. వజ్రేష్ యాదవ్**



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ నాగారం, ఎదులాబాద్ మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని నాగారం, ఎదులాబాద్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి కమిటీలను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ బుధవారం ప్రకటించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లక్ష్యంగా నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షుడు సామల అమర్, నాగారం డివిజన్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, నాగారం మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం 15వ వార్డులో చెత్త బుట్టల పంపిణీ



**వాస్తవ తెలంగాణ అక్టోబర్ 14 బండ నాగరాజు ప్రతినిధి** తూప్రాన్: స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ మున్సిపాలిటీని స్వచ్ఛ తూప్రాన్‌గా తీర్చిదిద్దేందుకు 15వ వార్డులో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసేందుకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొడిప్యాక అన్నపూర్ణ--నారాయణ గుప్త, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ పాల్గొని చెత్త బుట్టలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ తూప్రాన్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉమర్, వీరు యాదవ్, సమీర్, అప్పల రాజు, బాయికడి అంజితో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బి కె వై దుర్గా పూజా మహోత్సవాలకు బొంతు శ్రీదేవి యాదవ్ కు ఆహ్వానం ..



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలో నిర్వహించనున్న బి కె వై దుర్గా పూజా మహోత్సవాలకు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ని బి కె వై సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ బి కె వై కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి, దుర్గామాత పూజలు ఘనంగా విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్, బి కె వై అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదుకు 15, 16 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు

**అర్హులైన యువత ఫారం-6తో దరఖాస్తు చేసుకోవాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులు, తొలిసారి ఓటు హక్కు పొందనున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు, ఓటరు జాబితాలో పేరు లేని వారు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.శిబిరాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉండి ఓటరు నమోదుకు అవసరమైన సహాయాన్ని అందిస్తారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# సంగారెడ్డి పట్టణ టీఎన్జీవోస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా నూతన కార్యవర్గం**
**అధ్యక్షుడిగా యాదవ రెడ్డి.. కార్యదర్శిగా వెంకటేష్**
**ఏకగ్రీవంగా ఎన్నికైన పట్టణ సంఘం నూతన కమిటీ**
**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం**

**సంగారెడ్డి, వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి పట్టణ టీఎన్జీవోస్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జేఏసీ చైర్మన్ మహమ్మద్ జావిద్ అలీ, టీఎన్జీవోస్ కార్యదర్శి వేల్పూరు రవి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల కార్యక్రమానికి టీఎన్జీవోస్ అసోసియేట్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సంగారెడ్డి పట్టణ టీఎన్జీవోస్ సంఘం అధ్యక్షులుగా యాదవ రెడ్డి, కార్యదర్శిగా వెంకటేష్, అసోసియేట్ అధ్యక్షులుగా రమేష్, కోశాధికారిగా హైమద్ ఖాన్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా రాజు, సుజాత, నాగమణి, ప్రదీప్, జాయింట్ సెక్రటరీలుగా గోపాల్, పర్వీన్ బేగం, అజాం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రావణి ఎన్నికయ్యారు. అలాగే సంఘం సభ్యులుగా వసీమ, హైమద్, కిరణ్, యాదయ్య, లావణ్య, లతా, పజిల్ హైమద్, అజయ్, మునవర్, ఇమ్రాన్ ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, సంఘటిత శక్తిని బలోపేతం చేయడం నూతన కార్యవర్గం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల ఐక్యత, పరస్పర సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా, సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, కోశాధికారి శ్రీనివాస్, కృష్ణ, సుధామణి, నాగేశ్వరరావు, మల్లికార్జున్, రషీద్, షరీఫ్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

## ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్** ఎల్ఐసీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించాలని ఐసీఈయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు 1996 బ్యాచ్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ బుధవారం మెదక్ ఎల్ఐసీ కార్యాలయంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐసీఈయూ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశం, శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీవిత బీమా సంస్థ అభివృద్ధికి దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత గౌరవప్రదమైన పెన్షన్ కల్పించాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, వైద్య ఖర్చులు, కుటుంబ బాధ్యతల నేపథ్యంలో పెన్షన్ ఆర్థిక భద్రతకు ఆధారమని పేర్కొన్నారు. ఎల్ఐసీ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు. నిరసనలో ఉద్యోగులు సాయిచంద్ర ప్రకాశ్, వెంకటేశం, అనిల్, స్వామి, ప్రియాంక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ చేసిన మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి నాగరాణి శ్రీనివాస్ గుప్తా



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్,/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య మహిళా కార్మికులకు మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి నాగరాణి శ్రీనివాస్ గుప్తా బతుకమ్మ కానుకగా చీరలను పంపిణీ చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషి అనిర్వచనీయమని, వారి సేవలను గుర్తించి వారికి అండగా నిలవడం తమ బాధ్యత అని ఈ సందర్భంగా రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు ఎంతో ప్రత్యేకమైనదని, పండుగ వేళ పారిశుద్ధ్య మహిళా కార్మికుల ముఖంలో చిరునవ్వు చూడటమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు . ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి. రాజ్ కుమార్. శ్రీమన్నారాయణ. మౌనిక రెడ్డి. వసంత. సవిత గౌడ్. లేక గౌడ్ భారతి. రజిత. వనిత. మౌనిక. పలువురు మహిళా కార్మికులు పాల్గొని, తమకు చీరలను అందజేసిన మాజీ డిప్యూటీ మేయర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం తమ కష్టాన్ని గుర్తించి ఇలా పండుగ కానుకలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

# నీటి ఎద్దడి రాకుండా చర్యలు.. ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలన చేతగాక అన్ని వర్గాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు వెళుతున్నమని తెలిపారు. ప్రస్తుతం కరువు ప్రభావం, ఎల్ నినో ఎఫెక్ట్ తో వర్షాలు లేకపోవడంతో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చనుందని తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సింగూర్ ప్రాజెక్టుతో పాటు, కౌలాస్ నాలా, నల్లవాగు ప్రాజెక్టు నుండి తాగు నీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు.



# గొల్ల గూడెం గ్రామంలోమహిళ సమాఖ్య ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం గొల్లగూడెం గ్రామంలోతెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడు కుంటూనే, రాష్ట్రం లో మహిళలందరు పాల్గొనే ఏకైక పండగ బతుకమ్మ పండగని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్. లక్ష్మి అన్నారు. బుధవారం సదాశివపేట మండల పరిధిలోని గొల్ల గూడెం లో మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో బతుకమ్మ పండగను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆర్. లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చు కొని చిన్న పిల్లల నుండి వృద్దుల వరకు మహిళలు ఘనంగా ఆడుకునే పండగ బతుక్కమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రభావతి, శ్వేత, సుమలత, స్వరూప, సునీత, మంజుల మణెమ్మ, అనిత, లక్ష్మి, కృష్ణ వేణి, అనుశ్రీ, రుతిక తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకుల సమావేశం

**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా పట్టణంలో లోముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగిందిఈ సమావేశనికి జిల్లా అధ్యక్షులు పంబల దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ కోఆర్డినేటర్ ఎస్ వరుణ్ కుమార్ సార్ రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్ మీడియా కోఆర్డినేటర్ యాదయ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ విచ్చేసి అంబేద్కర్ ఆలోచన విధానంలో సంఘ సభ్యులు పనిచేయాలని, అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామ గ్రామాన సర్వోత్సవాలు నిర్వహించాలని, సభ్యత్వ నమోదు మరియు నూతన కమిటీలను ఏర్పాటు చేయాలనిప్రభుత్వాలు చట్టాల విషయంలో నిధుల విషయంలో ప్రజలకు ప్రయోజనాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వాటిపై పోరాటలు చేపట్టాలని పిలుపునియడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సంచుల జిల్లా ఉపాధ్యక్షులు భీమ్సేనప్రభాకర్ కార్యదర్శులు కొనుంటి మంజుల అనుముల తుకారాంగోపాల్ నాయక్ సున్నాయిల పవన్ కుమార్ నవీన్ బాలు తదితరులు పాల్గొన్నారు.




# మెదక్‌లో కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

**అనువైన భవనాలు, మౌలిక వసతులపై అధికారుల ఆరా**

**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ ,** జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అనువైన స్థలాల గుర్తింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాజు, విద్యాశాఖ కోఆర్డినేటర్ రాజు బుధవారం మెదక్ పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ధ్యాన్‌చంద్ సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలను సందర్శించి, అందుబాటులో ఉన్న భవనాలు, స్థలాలు, మౌలిక వసతులను పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతోపాటు జిల్లాలో విద్యావకాశాలు విస్తరిస్తాయని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, వసతుల వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పరిశీలనలో గుర్తించిన అంశాలతో నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు వెల్లడించారు.



# రోస్టర్ విధానం అమలుతోనే మాల సామాజిక వర్గానికి న్యాయం

### ఎస్సీ వర్గీకరణలో మాలలకు తగిన న్యాయం జరగలేదు
### సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలి
### తెలంగాణ రాష్ట్ర మాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ డిమాండ్



**తూప్రాన్, అక్టోబర్ 14: వాస్తవ తెలంగాణప్రతినిధి:** రోస్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసి మాల సామాజిక వర్గానికి న్యాయం చేయాలి ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో మాల సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదని తెలంగాణ రాష్ట్ర మాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ దిశగా ప్రభుత్వం సమగ్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాల సామాజిక వర్గానికి న్యాయమైన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**రోస్టర్ అమలుతోనే సమాన అవకాశాలు**

ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, రిజర్వేషన్ల అమలులో రోస్టర్ విధానం కీలక పాత్ర పోషిస్తుందని మందాల భాస్కర్ పేర్కొన్నారు. రిజర్వేషన్ల ఉద్దేశం అర్హులైన సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమేనని, ఆ లక్ష్యం నెరవేరేలా నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. రోస్టర్ విధానం అమలులో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సంబంధిత అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలను అనుసరించాలని కోరారు.

**వర్గీకరణలో మాలలకు న్యాయం జరగాలి**

ఎస్సీ వర్గీకరణపై మాల సామాజిక వర్గంలో నెలకొన్న ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. వర్గీకరణ అమలు వల్ల ఏ సామాజిక వర్గానికీ అన్యాయం జరగకుండా, రాజ్యాంగబద్ధమైన హక్కులు, రిజర్వేషన్ ప్రయోజనాలు సముచితంగా అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మాల సామాజిక వర్గానికి విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో న్యాయమైన అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వాన్ని బలోపేతం చేయవచ్చని అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి**

మాల సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, సంఘాల ప్రతినిధులతో చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని మందాల భాస్కర్ కోరారు. రోస్టర్ విధానం అమలు, రిజర్వేషన్ల ప్రయోజనాల పంపిణీ, ఉద్యోగ నియామకాల్లో సమాన అవకాశాల కల్పన వంటి అంశాలపై స్పష్టత తీసుకురావాలని సూచించారు. మాల సామాజిక వర్గానికి న్యాయం జరిగే వరకు తమ హక్కులు, సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా గొంతు వినిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ డిమాండ్ చేశారు. అనంతరం రాజ్యాంగ రక్షణ దళ వ్యవస్థాపక అధ్యక్షుడు రెంజర్ల రాజేష్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ అన్నగారు అనవసర రాద్ధాంతం చేస్తూ దళితులను తప్పు త్రోవ పట్టిస్తున్నాడని ఆ విషయం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ రాహుల్ స్టూడెంట్స్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పండుగ భానుతేజ దిలీప్ రమేష్ ఆకుల పెంటయ్య జిల్లా అధ్యక్షులు పోతురాజు కుమార్ మాల కమిషన్ వైస్ చైర్మన్ మామిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు..

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పని చేయాలి..!

### ఓటరు నమోదును వేగవంతంగా చేయాలి
### ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులకు పరమేశ్వర్ రెడ్డి పిలుపు



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పని చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.అర్హులైన పట్టభద్రుల నుంచి ఓటరు నమోదు చేయాలని సూచించారు. కాలనీలలో ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి అర్హత కలిగిన పట్టభద్రుల వివరాలను సేకరించడంతో పాటు ఓటరుగా నమోదు చేయాలని పిలుపునిచ్చారు.త్వరలోనే జారీ జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఉప్పల్ నియోజకవర్గంలోని ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు విషయంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని గురించి పరమేశ్వర్ రెడ్డి ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు.కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు ఆకారపు అరుణ్,కిషోర్ కుమార్ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# 30సంవత్సరాలుగా మహంకాళి దేవాలయ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా దేవీ నవరాత్రి వేడుకలు

### పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాపటాన్చెరువు పట్టణంలోని మైత్రి గ్రౌండ్‌లో మాజీ కార్పొరేటర్ సఫాన్ దేవ్ గారి ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయ సేవా సమితి నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి వేడుకల్లో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారుగత 30 సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, సేవా సమితి సభ్యులకు దేవీ నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూను ఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ మనవరాలు శ్వేతకు సన్మానం

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్కరించిన మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధికా భూపతిరాజ్.



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం దెబ్బతిన్న ఘటనపై ఆమె మనవరాలు శ్వేత బుధవారం మెదక్ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధికా భూపతిరాజ్, స్థానిక కౌన్సిలర్లు ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం విగ్రహం దెబ్బతినడానికి గల కారణాలను రాధికా భూపతిరాజ్ వివరించారు. కోతుల కారణంగానే విగ్రహం కిందపడి దెబ్బతిన్నట్లు తెలిపారు. విగ్రహ పునరుద్ధరణకు మున్సిపల్ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను శ్వేత అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్ మన్సూర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, రజక సంఘం సభ్యులు లక్ష్మణ్,వేణు,శివ, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బీజేఆర్ నగర్‌లో ఘనంగా (వి ఎన్ ఆర్) చికెన్ మార్ట్ ప్రారంభోత్సవం

### ముఖ్య అతిథులుగా హాజరైన పగిడాల లక్ష్మి శ్రావణి, రంగ శ్రీనివాస్ గౌడ్




**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** బీజేఆర్ నగర్‌లో చికెన్ మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పగిడాల లక్ష్మి శ్రావణి, రంగ శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర చైర్మన్ చెరుకు రమేష్ ముదిరాజ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులు, నాయకులు, ప్రముఖులు, కాలనీ వాసులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారి సమక్షంలో ప్రారంభోత్సవ వేడుక సందడిగా సాగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్యక్రమానికి హాజరైన అతిథులకు, నాయకులకు, కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794

# శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్





**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం పటాన్చెరు పట్టణంలోని శ్రీ మహంకాళి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రకాష్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, మాణిక్ ప్రభు, మల్లేష్, వినోద్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం

## భక్తిపారవశ్యంలో మునిగితేలిన భక్తజనం





**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణం గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.. వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి కల్యాణ ఘట్టం భక్తులను పరవశింపజేసింది. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణాన్ని తిలకించిన భక్తజనం భక్తిసాగరంలో మునిగితేలారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది.ఆలయ వంశపారంపర్య అర్చకులు కేవీ నరసింహాచార్యులు, కేవీ రంగనాథాచార్యులు వేద పండితుల బృందంతో కలిసి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణ ఘట్టం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు గోవింద నామస్మరణతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దుల బాల్‌రెడ్డి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మున్సిపల్ చైర్మన్ చిన్నపావని కుమార్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

# వెంకటాపురం తుడుం దెబ్బలో మరో కమిటీ ఏర్పాటుపై అభ్యంతరం

## ప్రస్తుత కమిటీ కొనసాగుతుండగానే కొత్త కమిటీ ఎలా ఏర్పాటు చేస్తారు
## రాష్ట్ర అధ్యక్షుడు జోక్యం చేసుకుని స్పష్టత ఇవ్వాలని మండల కమిటీ సభ్యుల విజ్ఞప్తి






ములుగు అక్టోబర్ 14 **వాస్తవ తెలంగాణ** ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) వెంకటాపురం మండలంలో మరో నూతన కమిటీ ఏర్పాటు చేయడంపై ప్రస్తుత మండల కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండేళ్ల కాలపరిమితితో కమిటీ కొనసాగుతుండగా, తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కొత్త కమిటీని ఎన్నుకోవడం సంఘం నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ జోక్యం చేసుకుని స్పష్టత ఇవ్వాలని కోరారు.వెంకటాపురం మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద తుడుం దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ సోడి శ్రీను అధ్యక్షతన బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తుర్స చంటి దొర మాట్లాడుతూ, ప్రస్తుత కమిటీని పక్కనపెట్టి మరో కమిటీ ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

**రెండేళ్ల కాలపరిమితి ఉండగానే కొత్త కమిటీ ఎలా?** ప్రస్తుత మండల కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఆగస్టు 4న వెంకటాపురంలోని కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాంగణంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో తుడుం దెబ్బ మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి తుర్స చంటి దొర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి ఆదివాసీ హక్కుల పరిరక్షణతోపాటు గిరిజన సమాజ సంక్షేమం కోసం పనిచేస్తున్నామని వారు తెలిపారు.అయితే, ప్రస్తుత కమిటీకి సమాచారం ఇవ్వకుండానే మంగళవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మరో నూతన కమిటీని ఎన్నుకోవడం వివాదానికి దారితీసిందని పేర్కొన్నారు. సంఘం నిబంధనల ప్రకారం ప్రస్తుత కమిటీకి రెండేళ్ల పదవీకాలం ఉందని, ఆ గడువు ముగియకముందే మరో కమిటీని ఏర్పాటు చేయడం వెనుక ఉన్న కారణాలను రాష్ట్ర నాయకత్వం వివరించాలని కోరారు.

**సంఘం బైలాపై స్పష్టత ఇవ్వాలి**

సంఘం బైలాను అనుసరించి కమిటీల నియామకం, మార్పులు చేపట్టాలని మండల నాయకులు సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలు, సంఘం నిబంధనలకు అనుగుణంగా కొత్త కమిటీ ఏర్పాటు జరిగిందా లేదా అనే అంశంపై స్పష్టత అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత కమిటీ కొనసాగింపు, కొత్త కమిటీ ఎన్నికకు సంబంధించిన వివాదాన్ని రాష్ట్ర స్థాయి నాయకత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కొత్త కమిటీ ఏర్పాటుకు సంబంధించి కొందరు నాయకుల వ్యవహారశైలిపై ప్రస్తుత కమిటీ వర్గాలు ఆరోపణలు వ్యక్తం చేశాయి. ఆదివాసీ హక్కుల సాధన కోసం పనిచేయాల్సిన సంఘాల్లో అంతర్గత విభేదాలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోందని అభిప్రాయపడ్డాయి. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత మరో వర్గం వివరణ అందుబాటులో లేదు.

**ఆదివాసీ ఐక్యత దెబ్బతినకూడదు**

ఆదివాసీ సమాజ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయంలో కమిటీల ఏర్పాటుపై వివాదాలు తలెత్తడం సంఘం కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఇలాంటి పరిణామాలతో యువతలో గందరగోళం ఏర్పడకుండా రాష్ట్ర నాయకత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.సంఘం ప్రతిష్ఠను కాపాడటంతోపాటు కార్యకర్తల్లో ఐక్యతను కొనసాగించేలా బైలాకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు పాయం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మిచ్చ సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోజు ఈ క్రింది ప్రాంతాలలో విద్యుత్ సరఫరా కు అంతరాయం..



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘాట్కేసర్ సర్కిల్ ఫీడర్ నిర్వహణ మరియు (పిఎంఐ) పనుల కారణంగా ఈ క్రింది ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది: 1) కీసర సబ్‌స్టేషన్ పరిధిలోని 11కె వి చెర్యాల లక్ష్మి' ఫీడర్ – ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు. ప్రభావిత ప్రాంతాలు: కుందన్‌పల్లి గ్రామం, వర్ధన స్కూల్, వికలాంగుల కాలనీ, గోడుమకుంట గ్రామం, ఏ జి ఎల్ సర్వీసెస్. లలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుంది అని విద్యుత్ సంబంధిత అధికారులు ఎస్. మురళీ కృష్ణ ఏ ఏ ఈ/ఓ పి/కీసర తెలిపారు.

# ఖేడ్ మున్సిపాలిటీలో నేడు ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపు




**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో కొత్త ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఌ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు, అలాగే ఇప్పటివరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని పట్టణ నివాసితుల కోసం ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 15 (గురువారం) రోజు నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. పట్టణంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్త ఓటరు నమోదుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో (ఐడెంటిటీ, అడ్రస్ ప్రూఫ్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు) క్యాంపునకు హాజరై, ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదై ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# సిఐటీయు లో చేరినా ఔటర్ రింగ్ రోడ్డు కాంట్రాక్ట్ ఉద్యోగులు..

కార్మికుల కోసం అలుపెరుగని పోరాటం చేసేది సిఐటీయు.. బంగారు నర్సింగ్ రావు..



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న సిఐటియు యూనియన్ లో చేరిన శామీర్పేట -కీసర -ఘట్కేసర్ ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న హెచ్ఎండిఏ కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 62 మంది సిఐటియు యూనియన్ లో చేరడం జరిగిందని సిఐటియు కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం కార్మిక చట్టాల అమలు కోసం కార్మికుల పక్షాన సిఐటియు అలుపెరుగని ఆందోళన పోరాటాలు నిర్వహిస్తుందన్నారు . కార్మికుల ప్రధాన డిమాండ్స్ : ఔటర్ రింగ్ రోడ్డు – హెచ్ఎండిఏ పరిధిలోని కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం 26,000 ఇవ్వాలి. కార్మికుల వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లో ఒకటవ తేదీన జీతాలు వెయ్యాలి. కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. కార్మికులందరికీ వారాంతపు సెలవులు అమలు చేయాలి. కార్మికులందరికీ తొమ్మిది రకాల సేఫ్టీ కిట్స్ అందజేయాలి. అర్బన్ ఫారెస్ట్రీ ,,పార్కులు,ల ఇంజనీరింగ్ మరియు పారిశుద్ధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. కాంట్రాక్ట్ కాల పరిమితి ముగించిన కార్మికులను ఎట్టి పరిస్థితుల్లో మార్చకూడదు కార్మికులందరినీ యధావిధిగా కొనసాగించాలనీ కార్యదర్శి, సిఐటియు కీసర మండల కమిటీ. బంగారు నర్సింగ్ రావు తెలిపారు.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

## సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం

## మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ డిమాండ్ చేశారు. మెదక్ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న ఉద్యోగులకు బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సేవలందించడంలో కీలకంగా ఉన్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలో కొనసాగించాలని, నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఏటా 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఉద్యోగి మరణిస్తే రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60, 1195 ప్రకారం పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని మల్లికార్జున్ గౌడ్ కోరారు. ఉద్యోగుల హక్కుల సాధనకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు మ్యాదరి దీపక్ కుమార్, జబ్బార్ అహ్మద్, మాయ మల్లేశం, నాయకులు లింగారెడ్డి, బీమరి కిషోర్, సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా బిజెపి కార్యాలయంలో పదాధికారుల సమావేశంలో దేశ్ పాండే

**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా లో బిజెపి కార్యాలయంలో నిర్వహించిన సంగారెడ్డి జిల్లా బిజెపి పదాధికారుల సమావేశం పార్టీ సంస్థాగత బలోపేతం రాబోయే కార్యక్రమాల నిర్వహణ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి పలు కీలక అంశాలు పై చర్చ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే ఈ కార్యక్రమం లోసంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి కులకర్ణి రాజశేఖర్ రెడ్డి మాణిక్యరావు వెంకట నరసింహారెడ్డి అమ్రాది ఎల్లయ్య సంగారెడ్డి జిల్లా పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్ నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి




ఖమ్మం, అక్టోబర్ 14 **వాస్తవ తెలంగాణ** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఓటరు జాబితా నమోదుపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,630 నోటీసుల పంపిణీ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని 99.07 శాతం నోటీసుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. 1,58,144 మందికి విచారణ పూర్తి చేశామని వెల్లడించారు.మిగిలిన విచారణలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని, ఓటర్ల నుంచి స్వీకరించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఫారం-6 దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి:** జిల్లాలో ఫారం-6కు సంబంధించి మొత్తం 6,435 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి పరిష్కారంపై ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి వచ్చే వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు జిల్లాలో సుమారు 27 వేల మంది నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. గతంలో 84 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఈసారి కనీసం 2 లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు.నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అన్నారు.

**మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, భారత రాష్ట్ర సమితి ప్రతినిధులు బి. వేణుగోపాల్, ఎం. రమేష్, ఏ. సతీష్ బాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, సీపీఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్‌ను బీజేపీ జేబు సంస్థగా మార్చే కుట్ర జరుగుతోంది

## ఢిల్లీ నిర్బంధంపై సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం ఆగ్రహం



**కారేపల్లి, అక్టోబర్ 14 --వాస్తవ తెలంగాణ** ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రజల గొంతు నొక్కే విధంగా వ్యవహరిస్తోందని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం విమర్శించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విద్యార్థులు, యువజనులు, ప్రజలు దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు నిర్వహిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పాల్పడటంలో ఆంతర్యమేమిటని, జ్ఞానేశ్ కుమార్‌పై ప్రధాని మోదీకి అంత ప్రేమ ఎందుకని ఆయన ప్రశ్నించారు.స్థానిక భాగం రామ నరసయ్య భవనంలో సీపీఎం సింగరేణి మండల కమిటీ, శాఖ కార్యదర్శుల సమావేశం మండల కమిటీ సభ్యుడు వల్లబోయిన కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భూక్య వీరభద్రం మాట్లాడుతూ.. ఎన్నికల కమిషనర్ రాజీనామా అంశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, స్వతంత్రత కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

**ఎన్నికల వ్యవస్థలో మార్పులపై విమర్శలు..** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో అవకతవకలు జరుగుతున్నాయని, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపికకు సంబంధించిన చట్టాల్లో మార్పులు చేయడం, కమిషనర్‌కు రక్షణ కల్పించే నిబంధనలపై పలు సందేహాలు తలెత్తుతున్నాయని భూక్య వీరభద్రం ఆరోపించారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది ఓట్ల తొలగించారనే ఆరోపణలు, ఓటు నమోదు దరఖాస్తుల నిబంధనల్లో మార్పులు, సుప్రీంకోర్టు తీర్పుల అమలు, తోటి ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పరిణామాలు ప్రజల ఓటు హక్కుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఢిల్లీలో నిర్బంధం ప్రజాస్వామ్యానికి విరుద్ధం..** ప్రజలు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తుంటే, విద్యార్థులు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు అనే తేడా లేకుండా నిర్బంధించడం సరికాదని భూక్య వీరభద్రం అన్నారు. ఢిల్లీలో ఆంక్షలు విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.ఆందోళనలను అణచివేసేందుకు ఇంటర్నెట్ నిలిపివేత, సామాజిక మాధ్యమాల్లో వక్రీకరణలు, అవమానకర ప్రచారాలు వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల నిరసనలను గౌరవించి, ఎన్నికల వ్యవస్థపై తలెత్తిన సందేహాలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ప్రజా ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం** దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజా సంపద పరిరక్షణ వంటి అంశాలపై ప్రజా ఉద్యమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని భూక్య వీరభద్రం పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర, వజ్జా రామారావు, కురసం శ్రీను, బానోత్ కిషన్, గంగాధర్, ని ఉపేందర్, పాల్తీయ రాంజి, వాంకుడోత్ బాబురావు, చల్ల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.